అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక
సంపుటి: 01 సంచిక : 138. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శనివారం.08.02.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## ఆర్టీసీ కార్మికులను చర్చలకు ఆహ్వానించిన తెలంగాణ ప్రభుత్వం

అమృత్ తెలంగాణ: హైదరాబాద్: ఈ నెల 10వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు చర్చలకు హాజరు కావాల్సిందిగా ఆర్టీసీ యాజమాన్యాన్ని, ఆర్టీసీ జేఏసీని ప్రభుత్వం ఆహ్వానించింది. తమ డిమాండ్లు నెరవేర్చని పక్షంలో ఫిబ్రవరి 9వ తేదీ లేదా ఆ తర్వాత ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని టీజీఎస్ఆర్టీసీ జేఏసీ గత నెల 27న బస్ భవన్‌లో ఆపరేషన్స్ ఈడీకి సమ్మె నోటీసును అందజేసింది. 21 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును అందజేయడంతో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. ఈ మేరకు కార్మిక శాఖ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. సమస్యల పరిష్కారానికి చర్చలకు ఆహ్వానించినట్లు కార్మిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలని, రెండు పీఆర్సీలను అమలు చేయాలని, 2021 వేతన సవరణను అమలు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని, ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీయే కొనుగోలు చేసి నడపాలని, ఇలా మొత్తం 21 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచింది.

## అక్రమ హోర్డింగ్‌లను తొలగించిన హైడ్రా అధికారులు

అమృత్ తెలంగాణ: హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో హైడ్రా అధికారులు అక్రమ హోర్డింగులను తొలగించారు. బెంగళూరు జాతీయ రహదారికి ఇరువైపులా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగులను మున్సిపల్ అధికారులతో కలిసి హైడ్రా తొలగించింది. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 17 హోర్డింగ్‌లను అనుమతి లేకుండా ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు. మున్సిపల్ అధికారులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా రంగంలోకి దిగి వాటిని తొలగించింది. అక్రమ హోర్డింగ్‌లపై చర్యలు కొనసాగుతాయని హైడ్రా అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, నిర్మాణ రంగ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను అక్రమంగా డంప్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హైడ్రా నిర్ణయించింది. చెరువులు, నాలాలు, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పోసే వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. అక్రమంగా వ్యర్థాలు డంప్ చేస్తున్న నాలుగు టిప్పర్లను హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు సీజ్ చేశాయి.

# క్యాబినెట్ విస్తరణ లేనట్టే !




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: తెలంగాణ క్యాబినెట్ విస్తరణ ఇప్పట్లో లేనట్లేనని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మంత్రి వర్గంలో ఎవరెవరుండాలో అధిష్టానానిదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం అక్కడి మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో పలు అంశాలపై మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణ కోసం తాను ఎవరి పేర్లు ప్రతిపాదించడం లేదని తెలిపారు. ప్రభుత్వం, పార్టీ నిర్ణయాలు అధిష్టానం దష్టిలో ఉంటాయని, వ్యక్తిగత నిర్ణయాలు తీసుకోవడమంటూ ఉండదని స్పష్టం చేశారు. పీసీసీ కార్యవర్గం కూర్పు ఓ కొలిక్కి వచ్చిందనీ, ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా పీసీసీ కార్యవర్గాన్ని ప్రకటిస్తామని అన్నారు. ప్రతిపక్ష నేతల కేసుల విషయంలో చట్ట ప్రకారం ముందుకు వెళతామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని సమస్యలకు తనకు ఉన్న అవకాశం మేరకు శాశ్వత పరిష్కారం దిశగా పని చేస్తున్నానని చెప్పారు. అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకుని కుల గణన చేపట్టామని, దీనివల్ల ముస్లిం రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కుల గణనలో బీసీలు ఐదున్నర శాతం పెరిగారని అన్నారు. బీసీలు పెరిగిన విషయం పాయల్ శంకర్ లెక్కలతో సహా చూసిన తర్వాతే అసెంబ్లీలో ఒప్పుకున్నారని చెప్పారు.

రాహుల్‌గాంధీకి, నాకు మధ్య గ్యాప్ లేదు

తాను లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ కోరలేదని రేవంత్ రెడ్డి చెప్పారు. రాహుల్ గాంధీతో తన అనుబంధం గురించి తెలియని వారు మాట్లాడితే నాకేం సంబంధం అని ప్రశ్నించారు. ప్రతి విమర్శకు తాను స్పందించాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు.

టీ కాంగ్రెస్ నేతలతో కేసీ వేణుగోపాల్ చర్చలు

తెలంగాణ ముఖ్యనేలతో ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ విడి విడిగా చర్చలు జరిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఏఐసీసీ వ్యవ హారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో చర్చించారు. అదే విధంగా పీసీసీ కార్యవర్గం కూర్పు మంత్రి వర్గ విస్తరణపై ఆయన నేతల అభిప్రాయాలను సేకరించారు.

తెలంగాణ కుల గణన దేశానికే ఆదర్శం : ఖర్గే

తెలంగాణలోని కాంగ్రెస్ సర్కార్ విజయవంతంగా చేసిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. 50 రోజుల పాటు ఆక్యూరేట్‌గా చేసిన ఈ సర్వే భేషుగ్గా ఉందని ప్రశంసించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని చేసి చూపిన సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి వర్గం, పార్టీ నేతలకు అభినందనలు తెలిపారు. శుక్రవారం పార్లమెంట్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ భేటీలో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్వర్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. దాదాపు అరగంట పాటు సాగిన ఈ భేటీలో మల్లికార్జున ఖర్గేకి కుల గణన నివేదికను సీఎం రేవంత్ రెడ్డి అందజేశారు. కుల గణన చేపట్టిన తీరు, ప్రస్తుతం సామాజిక వర్గాల వారీగా తేలిన లెక్కల వివరాలను తెలిపారు. ఈ లెక్కలకు అనుగుణంగా భవిష్యత్‌లో అమలు చేయబోయే రిజర్వేషన్లు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను వివరించారు. వీటితో పాటు మంత్రి వర్గ విస్తరణ, నూతన పీసీసీ కార్యవర్గంపై చర్చించారు. అలాగే రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

బహిరంగ సభలకు ఆహ్వానం

కుల గణన, ఎస్సీ వర్గీకరణ విజయవంతమైన నేపథ్యంలో రాష్ట్రంలో రెండు భారీ బహిరంగ సభలు నిర్వహించాలని యోచిస్తున్నట్టు మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. కుల గణనపై సూర్యాపేటలో, ఎస్సీ వర్గీకరణ అంశంపై గజ్వేల్‌లో బహిరంగ సభలు నిర్వహించబోతున్నట్టు తెలిపారు. ఈ రెండు సభలకు ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానం పలికారు. వీటితో పాటు మండల, జిల్లా స్థాయిలో విజయోత్సవ సభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కాగా సీఎం, రాష్ట్ర ముఖ్య నేతల ఆహ్వానంపై ఖర్గే సానుకూలంగా స్పందించారని పార్టీ నేతలు పేర్కొన్నారు.

సుమారు 25 మందితో రాష్ట్ర పీసీసీ కొత్త కార్యవర్గం

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కొత్త కార్యవర్గం నియామకం తుది అంకానికి చేరింది. సామాజిక సమతుల్యంతో కూడిన సుమారు 25 మందితో జాబితా సిద్ధం అయినట్లు తెలిసింది. ఇందులో కొత్తగా నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, 20కి పైగా వైస్ ప్రెసిడెంట్లకు చోటు కల్పించనున్నారు. ఈ జాబితా నేడో, రేపో అధిష్టానం ప్రకటించనున్నట్టు ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. కొత్త కార్యవర్గం కోసం పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర ముఖ్య నేతల నుంచి పలువురి పేర్లను స్వీకరించారు. ఈ జాబితాలోని పేర్లకు పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆమోద ముద్ర వేయగానే, పార్టీ కొత్త కార్యవర్గాన్ని ప్రకటిస్తారు. కాగా ఇప్పటి వరకు ఒకే వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఉండగా, రాష్ట్ర నేతల సూచనలతో తొలిసారి ఆ సంఖ్యను నాలుగుకు పెంచారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, రెడ్డి, మైనార్టీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి అవకాశం ఇవ్వనుంది. అయితే, పీసీసీ చీఫ్ బీసీ సామాజిక వర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి బీసీ సామాజిక వర్గం నుంచి ఎవర్నీ తీసుకునే అవకాశం లేదు. అయితే ఈ నాలుగు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవుల కోసం, ఆయా సామాజిక వర్గాల నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 12 మంది పేర్లను రాష్ట్ర నేతలు అధిష్టానానికి అందజేశారు. దీంతో పాటు మరో 15-20 పేర్లను పార్టీ ఉపాధ్యక్షుల పదవులకు సూచించినట్లు తెలిసింది.

# ప్రధాని మోడీ అమెరికా పర్యటన షెడ్యూల్ ఖరారు



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: ప్రధాని మోడీ అమెరికా పర్యటనకు షెడ్యూల్ ఖరారైంది. ఫిబ్రవరి 12-13 తేదీలలో ప్రధాని అమెరికాలో పర్యటించనున్నట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుక్రవారం ప్రకటించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఫిబ్రవరి 12న ప్రధాని అమెరికా వెళ్లనున్నారని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ కానున్నారని తెలిపింది. ప్రధాని పర్యటన భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. అమెరికా పర్యటనకు ముందు, ప్రధాని మోడీ ఫ్రాన్స్‌లో పర్యటించనున్నారు. ఫిబ్రవరి 10-12 వరకు ఫ్రాన్స్‌లో నిర్వహించే ఏఐయాక్షన్ సమ్మిట్‌కు ఆదేశ అధ్యక్షుడు మాక్రాన్‌తో పాటు సహ అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. దక్షిణ ఫ్రాన్స్‌లోని కాడరాచెలో నిర్వహిస్తున్న అతిపెద్ద ప్రయోగం 'ఇంటర్నేషనల్ థర్మోన్యూక్లియర్ ఎక్స్‌పెరిమెంటల్ రియాక్టర్ (ఐటిఇఆర్)'ను సందర్శించనున్నారు. ఈ ప్రయోగంలో భారత్ భాగస్వామిగా ఉంది.

# అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజగోపాల్ నగర్‌లో పర్యటించిన రంగనాథ్





హైదరాబాద్: అమృత్ తెలంగాణ: ప్లాట్ల విషయంలో కొనుగోలుదారులను కొందరు భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నట్లుగా ఉందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. రెండు వారాల్లో లోతుగా పరిశీలించి ఇరువర్గాలు చెప్పింది వింటామని, అదే సమయంలో కోర్టు పరిధిలో ఉన్న అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని రెండు నెలల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. రంగనాథ్ ఈరోజు అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్‌లో గల రాజగోపాల్ నగర్‌లో పర్యటించారు. తమ ప్లాట్లను కొంతమంది కబ్జా చేస్తున్నారంటూ రాజగోపాల్ నగర్ ప్లాట్స్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదుతో ఆయన పర్యటించారు. ఈ నేపథ్యంలో ఐలాపూర్‌లో పర్యటించిన రంగనాథ్ బాధితుల సమస్యలను విన్నారు. రాజగోపాల్ నగర్ అసోసియేషన్ సభ్యులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమావేశమయ్యారు. రంగనాథ్ బాధితుల సమస్యలు వింటున్న సమయంలో హైకోర్టు న్యాయవాది ముఖీం జోక్యం చేసుకున్నారు. న్యాయవాది ముఖీం, 'మీకు తెలుగు వచ్చా' అని హైడ్రా కమిషనర్‌ను అడిగారు.

కోర్టు పరిధిలో ఉన్న దానిని చూసేందుకు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు.

ఈ సందర్భంగా ఓవర్ యాక్షన్ చేయవద్దని న్యాయవాదిని రంగనాథ్ హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ అయింది. రాజగోపాల్ నగర్‌లో 40 ఏళ్ల క్రితం ప్లాట్లు కొనుగోలు చేశామని, కానీ కొంతమంది వచ్చి ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని బాధితులు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారని రంగనాథ్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలను ముందు పెట్టి ముఖీం అనే న్యాయవాది దీనిని కబ్జా చేసినట్లుగా ఆరోపణలు వచ్చాయన్నారు. కానీ 1980లలో ప్లాట్లు కొన్న వారిలో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీలు, పేదవారు ఉన్నారని రంగనాథ్ వెల్లడించారు. కరోనా సమయంలో తాము కట్టుకున్న ఇళ్లను కూలగొట్టారని బాధితులు ఆరోపించారని తెలిపారు. ఈ అంశానికి సంబంధించి వాస్తవాలు తెలుసుకోవడానికి తాము ఇక్కడకు వచ్చామన్నారు.

# ఎట్టకేలకు కొత్త రేషన్‌కార్డులు




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఎట్టకేలకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి మీ-సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించారు. ఈ మేరకు పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ శుక్రవారం ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డి) కమిషనర్‌కు లేఖ రాశారు. కొత్త రేషన్ కార్డులతో పాటు ప్రస్తుత రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకొనేందుకు కూడా అవకాశం కల్పించాలని ఆ లేఖలో కోరారు. ఇవే అంశాలను మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు చేసిన విషయం తెలిసిందే. ఈ సిఫార్సులకు జనవరి 4వ తేదీ జరిగిన రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కొత్త రేషన్‌కార్డుల విధివిధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు మీ-సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించేందుకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేసింది. మీ-సేవా కేంద్రాలకు అవసరమైన వెబ్ సర్వీసుల్ని అందించాలని నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌కు అదే లేఖలో పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా కొత్త రేషన్ కార్డులను అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చింది. గతేడాది ప్రజాపాలనలోనూ మిగిలిన హామీలతో పాటు కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులనూ స్వీకరించారు. అయితే అప్పటికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులపై నిర్ణయం తీసుకోలేదు. అయితే స్వీకరించిన దరఖాస్తుల్ని పరిగణలోకి తీసుకుంటామని మంత్రులు చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 89,21,907 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. కొత్తగా మరో 10 లక్షల తెల్లరేషన్ కార్డులు అవసరమవుతాయనీ, దీనివల్ల మరో 31 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే ఉన్న రేషన్ కార్డుల్లో కొత్తగా పేర్లు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం వద్ద 18 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పదేండ్లుగా అదనంగా పేర్లను చేర్చుకునేందుకు అవకాశమివ్వకపోవడంతో ఇవి పేరుకుపోయాయి. 2014కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతంలో 91,68,231 రేషన్ కార్డులుండగా, 3.38 కోట్ల మంది లబ్దిదారులున్నారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ నుంచి తరలి వెళ్లిన వారికి సంబంధించి 2,46,231 కార్డులు రద్దయ్యాయి. దీంతో రాష్ట్రంలో 89,21,907 తెల్ల రేషన్ కార్డుల ద్వారా 2.7 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారు. 2016 నుంచి 2023 వరకు కొత్తగా 6,47,479 ఆహార భద్రతా కార్డులను మంజూరు చేయగా అదనంగా 20,69,000 మందికి లబ్ది చేకూరింది. అదే సమయంలో 19 లక్షల మంది లబ్దిదారులను అనర్హులుగా గుర్తించి 5,98,000 ఆహార భద్రతా కార్డులను తొలగించారు. దీంతో 10 ఏండ్లలో నికరంగా మంజూరు చేసిన కార్డుల సంఖ్య 49 వేలు మాత్రమే. వీటిని కలుపుకుని మొత్తం 89.95 లక్షల తెల్ల రేషన్ కార్డులతో 2.81 కోట్ల మంది లబ్దిదారులు ప్రస్తుతం ఉన్నారు. రేషన్ షాపుల ద్వారా దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్టు ప్రకటించిన తర్వాత రేషన్ కార్డుల కోసం ఎదురు చూసే వారి సంఖ్య మరింత పెరిగింది. పీడీఎస్ రైస్ దారి మళ్ళుతుండటంతో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే గతంలో రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు ఇతరత్రా కొన్ని నిత్యావసర వస్తువులను చౌకగా అందించేవారు. కాంగ్రెస్‌పార్టీ ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డి దాదాపు 13 రకాల నిత్యావసర వస్తువులను కిట్‌గా అందించారు. వాటిని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

# అక్రమ కట్టడాలను కూల్చాల్సిందే

అమృత్ తెలంగాణ: హైదరాబాద్ :హైదరాబాద్.రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి సర్వే నంబర్ 51, 52, 53లోని 42 ఎకరాల్లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తుంటే జీహెచ్ఎంసీ అధికారులు ఏం చేస్తున్నారని హైకోర్టు ప్రశ్నించింది. అక్రమ నిర్మాణాలపై గతంలో తామిచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా కూల్చివేత చర్యలు తీసుకోవాలంది నుంచి ఎలాంటి అనుమతి పొందకుండా చేపట్టిన నిర్మాణాల వివరాలపై నివేదిక అందజేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌ను ఆదేశించింది. ధనవంతుల విషయంలో చూసీచూడనట్లుగా, పేదలు,మధ్యతరగతి ప్రజల విషయంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే కుదరదని, చట్టం అందరి విషయంలోనూ ఒకే విధంగా అమలు చేయకపోతే తాము చూస్తూ కూర్చోబోమని హెచ్చరించింది. గచ్చిబౌలి సర్వే నంబర్ 51, 52, 53తోపాటు అనుబంధ నంబర్లలోని 42.24 ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు తొలగించాలన్న గత హైకోర్టు ఉత్తర్వులు అమలు కాలేదంటూ యాదయ్య వేసిన కోర్టుధిక్కార పిటిషన్‌ను జస్టిస్ భాస్కర్‌రెడ్డి విచారించారు. విచారణకు ఆన్‌లైన్ ద్వారా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవెలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ హాజరయ్యారు. అక్రమ నిర్మాణాల కూల్చివేత చర్యలు తీసుకోవాల్సింది తాము కాదని ఆయన చెప్పడంతో తదుపరి విచారణకు హాజరుకానవసరం లేదని హైకోర్టు చెప్పింది. జీహెచ్ఎంసీ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడింది. అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కూడా ప్రశ్నించింది. విచారణ మార్చి 7కు వాయిదా వేసింది. ట్యాపింగ్ కేసులో శ్రవణ్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు తెలంగాణ హైకోర్టు జడ్జీల ఫోన్లను కూడా నిందితులు ట్యాపింగ్ చేసే ప్రయత్నాలు చేశారని, నిందితుల కంప్యూటర్స్‌లో జడ్జీల ప్రొఫైల్స్ ఉన్నాయని, దర్యాప్తులో కీలక విషయాలు రాబట్టాల్సివున్నందున నిందితుడు శ్రవణ్‌కుమార్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు హైకోర్టులో వాదనలు వినిపించారు.

# ఎలక్ట్రిక్ బస్సులపై దుష్ప్రచారం నమ్మొద్దు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: సంస్థలో కొత్తగా ప్రవేశపెడుతున్న పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగానే డిపోల ప్రైవేటీకరణ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ అన్నారు. ఈ ప్రచారాన్ని అస్సలు నమ్మొద్దనీ, ఎలక్ట్రిక్ బస్సులతో ఒక్క ఉద్యోగిని కూడా తొలగించే పరిస్థితే ఉండదని తేల్చి చెప్పారు. ప్రజలు ఉన్నంత కాలం ఆర్టీసీ ఉంటుందని, ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో ఉద్యోగులకు అపోహ, ఆందోళన అవసరం లేదన్నారు. శుక్రవారంనాడాయన బస్‌భవన్ నుంచి వర్చువల్‌లో రెండు విడతలుగా క్షేత్రస్థాయి ఉద్యోగులు, అధికారులతో సమావేశమయ్యారు. సంస్థ పనితీరు, సంక్రాంతి ఆపరేషన్స్, ఉద్యోగుల సంక్షేమం, మహాలక్ష్మి-మహిళలకు ఉచిత రవాణా సౌకర్య పథకం అమలు, తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా కొందరు ఉద్యోగులు ఎలక్ట్రిక్ బస్సులు, ప్రయివేటీకరణ అంశాన్ని ప్రస్తావించారు. దీనిపై ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ప్రజలకు కాలుష్యరహిత రవాణా సదుపాయంతో సాంకేతికతను అందుబాటులోకి తెస్తూ, పర్యావరణ హితమైన 40 ఎలక్ట్రిక్ బస్సులను 2019లో ఆర్టీసీలో ప్రవేశపెట్టామని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) పాలసీ ప్రకారమే గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) పద్ధతిన ఈ బస్సులను ఆర్టీసీ సమకూర్చుకుంటున్నదని వివరించారు. డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సులతో సహా అన్ని బస్సుల ఆపరేషన్స్ నిర్వహణ పూర్తిగా సంస్థ ఆధ్వర్యంలోనే జరుగుతుందనీ, దీనిలో ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేదన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను అన్ని రూట్లలో తిప్పడం సాధ్యపడదనీ, ప్రయివేటు అద్దె బస్సుల మాదిరిగానే ఎలక్ట్రిక్ బస్సులన్నీ టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలోనే నడుస్తాయనీ, ఆ బస్సుల ద్వారా వచ్చే టికెట్ ఆదాయం నేరుగా సంస్థకే వస్తుందని చెప్పారు. అందువల్ల ఎలక్ట్రిక్ బస్సులపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దన్నారు. సంక్రాంతికి సిబ్బంది అద్భుతంగా పనిచేశారనీ, కుటుంబాలకు దూరంగా, పండుగను త్యాగం చేసి ప్రయాణీకులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చారంటూ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తున్నారనీ, గడచిన మూడేండ్లుగా సంస్థ ఇచ్చిన ప్రతి ఛాలెంజ్‌ను ఉద్యోగులు విజయవంతం చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా సంస్థ పనితీరును మెరుగుపరుచుకునేందుకు క్షేత్రస్థాయి ఉద్యోగులు, అధికారులు ఇచ్చిన సలహాలు, సూచనలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల ఆర్టీసీ బలోపేతమవుతున్నదని చెప్పారు. మహాలక్ష్మి వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను సంస్థ సమకూర్చుకుంటున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సంస్థలో 3,038 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చిందనీ, ప్రస్తుతం వాటి నియామక ప్రక్రియ కొనసాగుతున్నదని వివరించారు. ఉద్యోగుల పెండింగ్ అంశాలన్నీ పరిశీలనలో ఉన్నాయనీ, దశల వారీగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో యాజమాన్యం పరిష్కరిస్తుందని స్పష్టం చేశారు. గడచిన మూడేండ్లుగా ఉద్యోగుల సంక్షేమానికి ఆర్టీసీ పెద్ద పీట వేస్తున్నదనీ, జీతాలు చెల్లించలేని స్థితి నుంచి ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలను అందజేసే స్థితికి ఎదిగిందని గుర్తుచేశారు. ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీని 21 శాతం ఫిట్‌మెంట్‌తో అందించి, పెండింగ్‌లో ఉన్న 11 డీఏలను 2019 నుంచి దశలవారీగా ఉద్యోగులకు విడుదల చేశామన్నారు. ఆర్పీఎస్-2013 బాండ్లకు సంబంధించి రూ.280 కోట్లను ఆర్టీసీ ఉద్యోగుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఆర్టీసీ సిబ్బంది ఆరోగ్య సంరక్షణ కోసం 'గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్' నిర్వహించి, తీవ్రమైన గుండె జబ్బులతో బాధపడుతున్న దాదాపు 800 మంది సిబ్బందికి ప్రాణాపాయం తప్పించామని వివరించారు.

# జైనథ్ మండలం కూర గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామీ ఆలయ బ్రహ్మోత్సవాలు





అమృత్ తెలంగాణ జైనథ్ మండలం న్యూస్ : జైనథ్ మండలం కూర గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామీ ఆలయ బ్రహ్మోత్సవాలు భాగంగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ శుక్రవారం ఆలయాన్ని సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు సాదరంగా స్వాగతం పలికారు. ఈ మేరకు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. గ్రామస్తులంతా ఐక్యంగా ఉంటూ ఆధ్యాత్మిక వేడుకలను ఘనంగా జరపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జైనథ్ మండల అధ్యక్షులు కరుణాకర్ నాయకులు రాందాస్ విజయ్ అశోక్ రెడ్డి రాకేష్ విశాల్ తదితరులున్నారు

# అదిలాబాద్ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ అదిలాబాద్ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం విద్యాశాఖ కార్యాలయానికి AD గా పదోన్నతి పై వచ్చిన ఎస్ . వేణుగోపాల్ గౌడ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది... ఈ సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలని పరిష్కరించాలని బీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అన్ని రకాల పాఠశాలలలో చదువుతున్నటువంటి బీసీ విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని జిల్లా అధ్యక్షులు చిక్కాల దత్తు ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్ కోరారు... ఈ సన్మాన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నర్సా గౌడ్ అధికార ప్రతినిధి కాసర్ల శ్రీనివాస్ గారు, మొదటి ఉపాధ్యక్షులు మేకల అశోక్ ఉపాధ్యక్షులు సత్యనారాయణ గారు, మొదటి సెక్టోలర్ అధికారి జెట్టి నారాయణ గారు,DEO కార్యాలయ సి.సి. రాజేశ్వర్ జూనియర్ అసిస్టెంట్ సతీష్ పాల్గొనడం జరిగింది



సన్మానిస్తున్న బీసీ ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్ మరియు బీసీ సంఘం నాయకులు

# మాలలకు అన్యాయం చెయడం ముఖ్యమంత్రికి తగదు, మాలల ఆగ్రహానికి కాంగ్రెస్ పార్టీ గురికాక తప్పదు మాలల జేఏసీ

మన్ననూర్ ఫిబ్రవరి 7 అమృత్ తెలంగాణ ,మన్ననూర్, అమ్రాబాద్ మండలం నాగర్ కర్నూల్ జిల్లా వార్త నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్ అంబేద్కర్ చౌరస్తా శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారి పై మాలల జేఏసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి తెలంగాణ అసెంబ్లీలో ఈ నెల 4వ తారీఖున రేవంత్ రెడ్డి గారు 341 ఆర్టికల్ కు విరుద్ధంగా తీర్మానం పెట్టడం సమంజసం కాదని దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం, సీఎం రేవంత్ రెడ్డి గారు మాల జాతి వారు కాంగ్రెస్ పార్టీకిచేసిన రాజకీయ సేవలను తుంగలో తొక్కుతూ వారికి అన్యాయం చేశారు,మాలజాతి మాత్రం స్వాతంత్రం వచ్చినప్పటినుండి కాంగ్రెస్ పార్టీకి చేసిన మేలు,మద్దతు ఇప్పటివరకు కూడా నిజాయితీగా ఉంటూ కాంగ్రెస్పార్టీకి చేసిన సేవలు మీరు మర్చిపోయారు.అసెంబ్లీలో పెట్టిన తీర్మాన బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని లేకపోతే మొత్తం మాల జాతి యొక్క వ్యతిరేకతకు మీరే బాద్యులవుతారని హెచ్చరిస్తున్నాం, సుప్రీంకోర్టు తీర్పులో ఏమి చెప్పారు అంటే 2024 సంవత్సరం కులగణన నిర్వహించి అందులో జనాభా ప్రాతిపదికన వర్గీకరణ చేసుకోవచ్చని సూచనలు మాత్రమే ఇచ్చింది.అట్టి తీర్పుకు తమరు ఏమాత్రం విలువ ఇవ్వకుండా ఏకపక్షంగా ప్రవర్తిస్తున్న తీరును మేము తీవ్రంగా ఖండిస్తున్నాం నేషనల్ సెన్సెస్ 2011 ప్రకారం ఎంపీరికల్ డాటా చెల్లదు, కానీ మీరు దానినే పరిగణలోకి తీసుకొని నిన్ను తీసుకుని నిర్ణయం సరికాదు, 2024 జనాభా కులగణన లెక్క ప్రకారం మీరు చేయించిన సర్వేలో ఏ కులానికి ఎంత వాటా ఉందో తెలియపరచలేదు, మీరు చేయించిన సర్వేలో బీసీలకు మరియు ఓసీలకు వారి కొరకు మాత్రమే సర్వే చేయించినట్టు ఉన్నది. వన్ మెన్ కమిషన్ గారు కూడా కాలయాపన చేసి వారికి తోచిన నివేదికను సమర్పించారు దానిని కూడా మేము ఖండిస్తున్నాము వ్యతిరేకిస్తున్నాం. ముఖ్యంగా మీరు చేసిన మూడు గ్రూపులలో ఇప్పటి వరకు ఏ గ్రూపు అంటే కులం వారు ఎవరు ఎన్ని ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు, సంక్షేమ పథకాలు ఎవరు ఎన్ని పొందారో పూర్తి సమాచారం వెల్లడించి ప్రజలకు తెలియజేయాల్సిన మీరు ఆ విషయం ప్రజలకు తెలియకుండా మభ్యపెట్టి ఇష్టారీతిగా చేసారు అని,అసెంబ్లీలో



మాలల జేఏసీ నాయకులు ఆందోళన

2024 సర్వే ప్రకారం బీసీలకు 42 శాతం వాటాను ప్రకటిస్తున్నామని అన్నారు ఇక్కడ జరిగేది ఎస్సీ క్లాసిఫికేషన్ అని తమరు మర్చిపోయినట్టున్నారు. మరొక్కసారి తమరికి విన్నవించుకోవడం ఏంటి అంటే మళ్ళీ ఒకసారి తెలంగాణ రాష్ట్ర కులగనన సర్వే నిర్వహించి లేకపోతే ఇప్పటికే జరిగిన సర్వేనైనా పూర్తిగా అందుబాటులో ఉంచాలి. అసలు ఏ రాష్ట్ర ప్రభుత్వానికి కులగణన చేసే అధికారం లేదు ఎందుకంటే నేషనల్ ఎస్సీ కమిషన్ అనుమతి లేకుండా ఏ రాష్ట్ర ప్రభుత్వాలు కుల గణన చేయకూడదు. రేవంత్ రెడ్డి సర్కార్ నేను స్వయంగా తెలంగాణలో కులగనణ చేయించానని అని చెప్పడం సిగ్గుచేటు, కానీ 2024 కుల గనణ చేయించాలని చెప్పారు కానీ దాని నివేదన ఎవరు ముందు పెట్టలేదు ఇట్టి విషయాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు మద్దెల దివాకర్, ఎనుపోతుల అనిల్,కలుముల నాసరయ్య,పెరుముల రాజేష్,ఇమ్మడి నరహరి, జక్క బాలకిష్టయ్య,ఎనుపోతుల అరుణ్ ఓయూ,మద్దెల ఆనంద్, రాం కోఠి,ఎల్లస్వామి,కలుముల శ్రీశైలం,చిక్కుడు యాదయ్య, చెవ్వ బాలు,మంచల అరుణ్,బియ్యని అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా విగ్రహా ప్రతిష్ఠాపన దినోత్సవం

నిర్మల్ జిల్లా బీ భైంసా ఫిబ్రవరి 7 అమృత్ తెలంగాణ భైంసా మండలంలోని సుంక్లి గ్రామంలో వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో శ్రీ బసవేశ్వర స్వామి విగ్రహా ప్రతిష్ఠాపన దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఫిబ్రవరి 7వ తేదిన గ్రామంలో శ్రీ బసవేశ్వర విగ్రహాన్ని ప్రతిష్ఠించిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. వీర శైవా లింగాయత్ సమాజం అన్ని రంగాల్లో రాణించాలని యువతకు పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బసవేశ్వరుడు చూపిన భాటలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవా లింగాయత్ సంఘ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.చైర్మన్, బి. అశోక్ పటేల్ వైస్ ప్రెసిడెంట్, బి. గంగాధర్ పటేల్, పాపన్న పటేల్, కె గజానంద్ పటేల్ చందు పటేల్, బసవేశ్వర్ పటేల్, దొడ్డిమిడి శంకర్ పటేల వీరప్ప పటేల్, మాధవ్ పటేల్. ఈ కార్యక్రమంలో బసవేశ్వర మహరాజ్ చిత్రపటం మరియు పాన్ ఉత్సవం ఉన్నాయి



బసవేశ్వర స్వామి విగ్ర ప్రతిష్టాపన కార్యక్రమం

# పంచాయతీల్లో ఇంటిపన్ను వసూలు వందశాతం పూర్తి చేయాలి. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి.

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ పంచాయితీలో వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఇంటి పన్ను వసూలు, వన మహోత్సవం, తదితర అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పంచాయతీలో ఇంటి పన్ను వసూలును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న వేసవికాలంలో ప్రజలకు త్రాగునీటికి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. పంచాయితీ కార్యదర్శులు గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, చేతి పంపులు, బోరు బావుల పనితీరును పర్యవేక్షించి, అవసరమైన చోట మరమ్మత్తులు చేపట్టాలన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. తీవ్రమైన నీటి ఒత్తిడి గల మండలాలను గుర్తించి ఆయా మండలాల్లోని గ్రామాలలో నీటి సమస్యను అధిగమించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి పన్ను వసూలు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు గ్రామాల్లో వసూలు చేసిన ఇంటి పన్ను వసూలు వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు వసూలు చేసిన పన్నులకు చలానాలు కట్టి, సంబంధిత ఖాతాల్లో జమచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అన్ని రకాల వ్యాపారస్తుల వాణిజ్య లైసెన్సులను వంద శాతం పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభోత్సవం నాటికి గ్రామాల్లోని నర్సరీలో పెంచుతున్న మొక్కలను సిద్ధం చేయాలన్నారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శిస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో తనిఖీ చేసి నివేదికలను పంపాలన్నారు. గ్రామాల్లో నిరంతరం మెరుగైన పారిశుధ్యాన్ని కొనసాగించాలన్నారు. మండలస్థాయి అధికారులకు గ్రామీణ స్థాయి అధికారులపై నియంత్రణ కలిగి ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది తమ విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ గోవింద్, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, ఎంపీడీఓలు, ఎంపిఓలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

# అంబేద్కర్ విజయం వెనుక ఉన్న అదృశ్య శక్తి రమాబాయి:ఆత్రం సుగుణక్క






అమృత్ తెలంగాణ ఉట్నూర్ న్యూస్ ఆదిలాబాద్ పట్టణంలోని అశోకబుద్ధ విహారంలో రమాబాయి అంబేద్కర్ 128వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క రమాబాయి ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ మాతా రామాబాయి అంబేద్కర్ త్యాగాల తల్లి అని కొనియాడారు.ఒక మహిళ వెనుక మగాడు ఉంటాడని మనం వాడుకునే పదం, ఈ దంపతుల విషయంలో మాత్రం మగాడి వెనుక మహిళ ఉందని చెప్పుకోవలసిన అవసరం ఉందని తెలిపారు.అంబేద్కర్ విజయం వెనుక ఉన్న అదృశ్య శక్తి రమాబాయి అని చెప్పారు.పేడ పిసికి పిడకలు కొట్టి తన భర్త డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చదువుల కోసం డబ్బులు పంపించిన గొప్ప మహిళ అని అన్నారు.డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ జాతికి చేసిన సేవలు, రాజ్యాంగంలో కల్పించిన హక్కులు,రిజర్వేషన్లు,మనం అనుభవిస్తున్న ప్రతి ఒక్క దాని వెనుక మాతా రమాబాయి అంబేద్కర్ త్యాగం ఉందని తెలిపారు.ఆమె చేసిన త్యాగాలు చిరస్మరణీయమని,మహిళలు, యువతులు ఆమె అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. రాజకీయ లబ్ధి కోసం రాజ్యాంగాన్ని మార్చడానికి బీజేపీ ప్రయత్నాలు చేస్తుందని,ఇటీవల కేంద్ర మంత్రి అమిత్ షా పార్లమెంట్ లో మాట్లాడిన మాటలు రాజ్యాంగాన్ని కించపరిచేలా ఉన్నాయని, మహిళలు ముందు వరుసలో ఉండి ఉద్యమించినప్పుడే ఓట్ల విప్లవం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రామాబాయి అంబేద్కర్ మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు ఆత్రం సుగుణక్క క్యాంపు కార్యాలయం, ఉట్నూర్

# కాంగ్రెస్ పార్టీలో చేరిన వడ్డాడి BRS పార్టీ సీనియర్ నాయకులు

అమృత్ తెలంగాణ తాంసి మండలం న్యూస్ నేడు తలమడుగు మాజీ zptc గణేష్ రెడ్డి మరియు సంతోష్, నారాయణ ఆధ్వర్యంలో BRS పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తూ ఎన్నో కోట్ల రూపాయలతో నిధులు ఈ నియోజకవర్గానికి తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడుపుతున్నందుకు గాను పార్టీ లో చేరామని అదేవిధంగా ప్రభుత్వం తీసుకువస్తున్న పథకాలను ప్రజలకు ఎంతో మేలు చేసేవిధంగా ఉన్నందున పార్టీలో చేరామని పార్టీ బలోపేతానికి గణేష్ రెడ్డి నాయకత్వంలో కలిసి ముందుకు వెళ్తామని రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలిపి లక్ష్యంగా పనిచేస్తానని తెలియజేశారు చేరిన వారిలో సీనియర్ నాయకులు చంద్రకాంత్, సూరం కిషన్ , మహేందర్ , సాయికుమార్, తో పాటు దాదాపు 20 మంది పార్టీలో చేరారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ వాకి, నవీన్, గంగయ్య, గంగాధర్, సయ్యద్ మూస, హన్మండ్లు, రమాకాంత్, శ్రీకాంత్, ఇందుర్ అశోక్, నగేష్ రెడ్డి పాల్గొన్నారు.



కండువా కప్పుతున్న మాజీ జెడ్పిటిసి గణేష్ రెడ్డి


# గ్రామస్తులతో సమాలోచనలు చేసిన మండల స్థాయి అధికారుల బృందం

అశ్వారావుపేట :అమృత్ తెలంగాణ: ప్రభుత్వ పథకం అయినా,ప్రజా సంక్షేమం అయినా మరే ఇతర సమాజ హితం కోరేది ఏదైనా పేదరికానికి అర్హులైన, సంక్షేమంతో సమగ్రాభివృద్ధి చెందే వారికే ఉపయోగకరంగా ఉండాలి.ప్రభుత్వ లక్ష్యం కూడా అదే.ఆ లక్ష్యానికి అనుగుణంగా పనిచేసే ముందు చూపు ఉన్న అధికారులు తోనే అది సాధ్యం. ప్రజా సంక్షేమమే లక్ష్యంతో పనిచేసే అధికారులు ఎక్కడైతే పని చేస్తారో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది అనడంతో సందేహమే లేదు. అదీ ఎవరైతే నిజమైన పేదలు ఉన్నారో వారి కోసం పనిచేసిన అధికారులు సైతం చరిత్రలో స్థానం దక్కించుకుంటారు.అలాంటివారిలో ఆర్.ఎస్ శంకరన్ ఒకరు.ఆ మహనీయుల అడుగుజాడల్లో నే ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్,ఐటీడీఏ పీఓ బి.రాహూల్ లు పయనించడం తో ఎవరైతే నిజమైన పేద లో వారికి న్యాయం జరుగుతుంది. ఇదంతా ఎందుకు చెప్పాల్సిన అవసరం వచ్చింది అంటే సమాజంలో ఏ వర్గం అయితే అట్టడుగున ఉందో వారి సమగ్రాభివృద్ధికి అహర్నిశలు పాటు పడుతూ వారి శ్రేయస్సు కోసం ముందు చూపుతో అడుగులు వేస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్ ప్రస్తుతం సమాజంలో అత్యంత బలహీనంగా ఉన్న కొండ రెడ్ల సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళికలు రచిస్తూ వాటిని ఆచరణలో పెడుతున్నారు. అందులో భాగంగా ఈ నియోజక వర్గంలో పీవీ టీజీ( పర్టికులర్ లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్) లుగా ఉన్న అత్యంత అడుగున ఉన్న "కొండ రెడ్ల" విద్యాభివృద్ధికి నడుంబిగించారు. అశ్వారావుపేట నియోజక వర్గంలో దమ్మపేట మండలం పూచి కుంట, అశ్వారావుపేట మండలం పాత రెడ్డిగూడెం పంచాయితీ లో రెడ్డిగూడెం,బండారు గుంపు,నడిమి రెడ్డిగూడెం,తిరుములకుంట,గాండ్లగూడెం,గోగులపుడి గ్రామాల్లో కొండ రెడ్లు కుటుంబాలు ఉన్నాయి.ఏ సమాజం సమగ్ర అభివృద్ధి చెందినా చదువుతో నే అని ఆశించిన పీఓ రాహుల్ ఈ పిల్లలు కోసం ప్రత్యేకంగా ప్రాథమిక గురుకుల ఆశ్రమ పాఠశాలను స్థాపించాలని నిర్ణయించారు. ఇందులో 70 శాతం కొండ రెడ్ల పిల్లలకు,30 శాతం ఇతర గిరిజన సమూహాలు పిల్లలకు రిజర్వేషన్ కల్పించి నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించి ఆ సామాజిక వర్గాన్ని తీర్చిదిద్దాలనే ఆలోచనలకు కార్యరూపం దాల్చుతుంది.

# నిర్మల్ పోలీస్...... మీ పోలీస్.

## పోరు కన్నా ఊరు మిన్నా మన ఊరికి తిరిగి రండి......
## నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపిఎస్.










అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ ప్రస్తుతం మీ ఉద్యమంలో ఒకరు మునిగిపోతున్న ఓడలాంటిది అందులో ప్రయాణించి మీ అమూల్యమైన ప్రాణాలు పోగొట్టుకోకండి... నిర్మల్ జిల్లా పోలీసుల ఎదుట లొంగిపొండి మీ కుటుంబంతో ప్రశాంతంగా జీవించండి. పోరుకన్న ఊరు మిన్న మన ఊరికి తిరిగి రండి అనే కార్యక్రమం లో బాగంగా ఈరోజు ఉదయం ఖానాపూర్ మండలంలోని బావాపూర్ ఆర్ గ్రామంలో శ్రీనివాస్ అనే యు.జి క్యాడర్ కుటుంబ సభ్యుల్ని నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి .జానకి షర్మిల ఐపీఎస్ కలవటం జరిగింది. శ్రీనివాస్ తల్లి ఎంతో బాధపడుతూ తనకు కొరివి పెట్టడానికి ఎవరూ లేరు తాను చనిపోయే లోపు తన కుమారుని చూడాలని ఎంతగానో బాధపడుతూ తన సమస్యను నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్ కి తెలపడం జరిగింది. ఒక తల్లి గా ఇంకో తల్లి ఆవేదనను అర్థం చేసుకొని శ్రీనివాసు తన కుటుంబ సభ్యుల కోసం మావోయిస్టు పార్టీని విడి జనజీవన స్రవంతిలో కలిసి ప్రశాంతంగా జీవనాన్ని గడపాలని విజ్ఞప్తి చేశారు, శ్రీనివాస్ పునరావాసానికి సంబంధించి అన్ని రకాల ప్రతిఫలాలను అందజేసి పునరావాసం కల్పించే విధంగా ప్రభుత్వం చేపడుతుందని అని ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీనివాస్ కుటుంబానికి రెండు నెలలకు సరిపడినంత రేషన్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎస్పీ తో పాటు ఏ.ఎస్పీ



రాజేష్ మీనా ఐపీఎస్, ఖానాపూర్ సిఐ సైదారావు , ఎస్సైలు ఇతర పోలీస్ సిబ్బందితో పాటు గ్రామ పెద్దలు అందరూ శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో పాలు పంచుకోవడం జరిగింది

# నిర్మల్ పోలీస్..... మీ పోలీస్.

## రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన మహిళా ఎస్ఐ జ్యోతి కి నగదు పురస్కారం.



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ పోలీస్ అమరవీరుల దినోత్సవం (అక్టోబరు -21st -పోలీస్ ఫ్లాగ్ డే) ను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలో నిర్మల్ జిల్లా నుండి పాల్గొని ద్వితీయ స్థానం లో నిలిచిన మహిళా ఎస్ఐ డి . జ్యోతిమని నీ జిల్లా ఎస్పీ డాక్టర్ జి . జానకి షర్మిల ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించి బహుమతిగా 15000/ రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావడం సంతోషకరమని తెలియజేస్తూ ఎస్సై జ్యోతిమని ని జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిళ ఐపీఎస్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎస్పీ తో పాటు డిపిఓ ఏవో యూనస్ అలీ , ఆర్ఐ రమేష్, రామ కృష్ణ, సూపర్ఇండెంట్ శ్రీనివాస్, ఆర్ ఎస్ఐ రవి కుమార్ లు పాల్గొన్నారు

# స్వర్గీయ మల్లు అనంత రాములు గారి 35 వర్ధంతి





అమృత్ తెలంగాణ ఖానాపూర్ న్యూస్ 35 వర్ధంతి సందర్భంగా స్వర్గీయ మల్లు అనంత రాములు వర్ధంతి సందర్భంగా ఈరోజు ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఈ కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ ఫాలోవర్స్ ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శనిగారపు కమలాకర్ మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కాంగ్రెస్ కుటుంబం సభ్యులు ఆయన ఆత్మకు ఆత్మకు శాంతి కలగాలని ఆయనకు ఘన నివాళులు అర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల్ అధ్యక్షులు దొనికేని దయానంద్ గారు ఖానాపూర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ చిన్నం సత్యం గారు ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ నిమ్మల రమేష్ గారు ఖానాపూర్ మండల వైస్ ఎంపీపీ మాజీ తోట సత్యం గారు కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు బానోత్ గోవింద్ గారు రాస మల్ల అశోక్ గారు నబీ ఖాన్ గారు చొప్పదండి రాజేష్ కుమార్ వేల్పుల రమేష్ మామిడిపల్లి బెన్నీ జంగా అభిషేక్ ఎస్టీ సెల్ జిల్లా నాయకులు సార్ల నర్షయ్య శనిగారపు కమలాకర్ రాహుల్ గాంధీ ఫాలోవర్ ఫ్రంట్ తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్

# ప్రాథమికదశ లో గుర్తించి చికిత్సతీసుకుంటే ఎలాంటి అంగవైకల్యం కలగదు..జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్











అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఆదిలాబాద్ రూరల్:- కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ఎలాంటి అంగవైకల్యం కలగదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చాందా మైనారిటీ బాలుర పాఠశాల లో స్పర్ష్ లెప్రసీ అవేర్నెస్ క్యాంపెయిన్ లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంకోలి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఎం ఎం హెచ్ ఓ మాట్లాడుతూ మైకో బ్యాక్టీరియం లేప్రే అనే బ్యాక్టీరియా వల్ల కుష్టు వ్యాధి వస్తుందని అన్నారు. శరీరంపై పాలిపోయిన రాగి రంగు గల మొద్దు వారిన మచ్చలు,కాళ్లు చేతుల్లో తిమ్మిర్లు రావడం కుష్టు వ్యాధికి సంబంధించిన లక్షణాలు అని తెలిపారు. ఈ వ్యాధికి అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆసుపత్రుల్లో ఎం డి టి చికిత్సను అందిస్తున్నామని తెలిపారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు దగ్గరలోని ఆశా కార్యకర్తలను,వైద్య సిబ్బందిని,వైద్యులను ఆసుపత్రులను సంప్రదించాలని సూచించారు. కుష్టు వ్యాధి గుర్తించడంలో జాప్యం జరిగితే అంగవైకల్యం సంభవిస్తుందని, అంగవైకల్యం సరి చేయడం కష్టతరంగా మారుతుంది అన్నారు. ప్రతి ఒక్కరూ కుష్టు వ్యాధి పై అవగాహన పెంపొందించుకొని, కుష్టు వ్యాధిని అంతం చేయడానికి సహకరించాలని పిలుపునిచ్చారు. జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ గజానన్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి పట్ల ఎలాంటి భయాందోళనలు పెట్టుకోకుండా, అనుమానిత లక్షణాలు ఉన్నవారు సమీపంలోని వైద్యులను సంప్రదించి చికిత్సలు పొందాలని కోరారు. అనంతరం కుష్టు వ్యాధి నివారణకు పాటుపడుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి వామన్ రావు, ఎం ఎల్ హెచ్ పి. అశ్విని, ఆరోగ్య పర్య వేక్షకులు సుభాష్, ఏఎన్ఎం తార, ప్రిన్సిపల్ వందన, ఆశా కార్యకర్త పార్వతి పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా రమాబాయి అంబేద్కర్ 127 వ జయంతి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ అదిలాబాద్ జిల్లా మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రమాబాయి అంబేద్కర్ గారి 127 వ జయంతి సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ మాట్లాడుతూ అంబేద్కర్ లండన్ లో చదువుతున్న సమయంలో తను పస్తులున్న కానీ అంబేద్కర్ తెలియకుండా తన పిల్లలకు ఒక పూట భోజనం చేసుదుకు కూడా కష్టం ఉన్న సమయంలో కూడా నేను ఇక్కడ బాగానే ఉన్నా మీరు బాగా చదివి మన దళితుల అభ్యున్నతి కోసం కష్టపడండి అని ఉత్తరాలు పంపడం జరిగింది అదే సమయంలో తన నలుగురు సంతానము కూడా మరణించినారు అటువంటి వీరనారి రమాబాయి అంబేద్కర్ అని కొనియాడినారు ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లన్న ఎలుక రాజు పాశం రాఘవేంద్ర బోండ్ల వెంకటస్వామి



నివాళులు అర్పిస్తున్న మాల సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ మరియు మాల సంఘం నాయకులు

మాదాసు అర్జున్ చంటి రవి, బోండ్ల భూమన్న నర్సింలు రాములు పతిహార పోశెట్టి ప్రభాకర్ కంది చంద్రశేఖర్, కూన మల్ల గంగన్న తదితరులు పాల్గొన్నారు

# ఆదిలాబాద్ విద్యాశాఖ కార్యాలయ ఏడీగా వేణుగోపాల్

ఆదిలాబాద్ :అమృత్ తెలంగాణ: జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఏడీ గా పదోన్నతి పై వచ్చిన ఎస్.వేణుగోపాల్ గౌడ్ ను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలని పరిష్కరించాలని బీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అన్ని రకాల పాఠశాలలలో చదువుతున్నటువంటి బీసీ విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నర్సా గౌడ్, అధికార ప్రతినిధి కాసర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మేకల అశోక్, సత్యనారాయణ, సెక్టోరియల్ అధికారి జెట్టి నారాయణ, డీఈఓ కార్యాలయ సి.సి రాజేశ్వర్, జూనియర్ అసిస్టెంట్ సతీష్ పాల్గొన్నారు.

# ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో అగ్ని ప్రమాదాల నివారణ సులభం

జన్నారం :అమృత్ తెలంగాణ: అడవులలో అగ్ని ప్రమాదాలను ముందస్తుగా గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగపడుతుందని పర్యావరణవేత్తలు అన్నారు. అడవులలో అగ్ని ప్రమాదాల నివారణకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఏఐ వినియోగం, దానిపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం జన్నారం మండల కేంద్రంలోని ఫారెస్ట్ టిడిసి సెంటర్లో అటవీశాఖ అధికారులకు సిబ్బందికి అవగాహన కల్పించారు. అభయారణ్యంలోని అటవీ ప్రాంతాలలో ఏఐ ఉపయోగించి ముందుగానే అగ్ని ప్రమాదాలను గుర్తించి అరికట్టవచ్చని వివరించారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో అడవులలో జరిగే అగ్ని ప్రమాదాలు నివారించుకోవడానికి, అలాగే అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడానికి ఈ శిక్షణ అటవీశాఖ అధికారులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం అడవులలోకి తీసుకువెళ్లి అగ్ని ప్రమాదాల నివారణ



అనే అంశం ప్రాక్టికల్ గా చేసి చూపించారు. కార్యక్రమంలో ఎఫ్డిపిటి శాంతారామ్, డి ఎఫ్ ఓ శివ అసిస్ సింగ్, తలపేట ఎఫ్ఆర్ఓ సుష్మారావు, ఇందన్ పల్లి ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్, శిక్షకులు బెంగళూరు వైల్డ్ లైఫ్ స్టడీ సెంటర్ అధికారి నరేంద్రన్ కోదండపాణి ఎఫ్ ఎస్ ఓ లు ఎఫ్బి వోలు ఇతర అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# చెట్ల నరికివేతలో అసలు దొంగలు ఎవరు..?

## చెట్లు నరికిన వారిపై ఫిర్యాదు చేశామంటున్న ఎన్ఎస్పి జెఇఇ

## కేసు నమోదు చేయని పోలీసులు

## ట్రాక్టరను ఎలా తప్పించారు.

## కేసులేకుండా అధికార పార్టీ నేతల ఒత్తిడి



ముప్పాళ్ళ, అమృత్ తెలంగాణ: ఫిబ్రవరి 7.మండల పరిధిలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు కార్యాలయానికి కూత వేటు దూరంలో కాలువ కట్టపై అక్రమంగా చెట్ల నరికివేత పై పోలీస్ స్టేషన్లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని ఎన్ఎస్ పి అధికారులు తెలిపారు. అయితే ఆ ఫిర్యాదు పై స్పష్టమైన సమాచారం ఇవ్వకుండా కేసు నమోదులో పోలీసులు తాత్సారం చేస్తున్నారు. అసలు ఈ కథలో దొంగలు ఎవరు.. చెట్లను నరికినవా రా..కేసు నమోదు కాకుండా అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతున్న ప్రభుత్వ అధికారులా.? అని స్థానికులు విమర్శిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన ఎస్ కె భాషాఅనే వ్యక్తి పై ఎన్ఎస్ పి జేఇ ఇ.. ఫిర్యాదు చేశామని చెప్తుండగా.. పోలీసులు ఎందుకు కేసు నమోదు చేయడం లేదో.. అంత పట్టని " రాజకీయంగా " మారింది. కాలువ కట్టపై నుండి ముందుగానే ట్రాక్టర్ను పంపించివేశారు.కొన్ని దుంగలనుకూడా తీసుకెళ్లినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వరుసగా ఐదు రోజులు నుండి రాత్రి వేళలో ట్రాక్టరు పై నరసరావుపేట అడితీ కి మొద్దులను తరలిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారములో ఎన్ఎస్పి అధికారులకు తెలియకుండా ఏం జరగదని విమర్శలు ఉన్నాయి. ఈ చెట్లను నరికి వేసిన సదరు వ్యక్తులు తరచూ ఇదే పనిగా వ్యవహరిస్తున్నారని కఠిన చర్యలు తీసుకోకపోతే ఇదే పరిస్థితి కొనసాగుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# డివి రాఘవులు నామినేషన్



అమృత్ తెలంగాణ:ఫిబ్రవరి 7. ఏలూరు అర్బన్, సిటీ ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్సి ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులు (డివి.రాఘవులు) నామినేషన్ కార్యక్రమం భారీ ర్యాలీతో అట్టహాసంగా సాగింది. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్ నుండి వందలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు, కార్మిక, ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుండి ఫైర్ స్టేషన్ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్లో రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వికి అభ్యర్థి డి.వి.రాఘవులు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం సిఐటియు కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ బహిరంగ సభకు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి అధ్యక్షత వహించి మాట్లాడుతూ 2007 నుంచి పిడిఎఫ్ అభ్యర్థులుగా గెలుపొందిన వారు నీతి, నిజాయతీకి నిదర్శనంగా నిలిచారన్నారు. ముఖ్యఅతిథి శాసనమండలిలో పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్, కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్సి కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే శక్తి పిడిఎఫ్ అభ్యర్థులకు మాత్రమే ఉందన్నారు. స్వలాభం కోసం కాకుండా ప్రజా సంక్షేమం కోసం పాటుపడే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. డి.వి.రాఘవులు 40 సంవత్సరాలుగా యుటిఎఫ్లో వివిధ స్థాయిల్లో పని చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఎన్నికకు కేవలం 20 రోజుల సమయం మాత్రమే ఉందని, ఈ 20 రోజులు 24 గంటలు పని చేయాలని కోరారు. కూటమి అభ్యర్థికి రాజకీయ, కుల, ధన, బలాలు ఉన్నాయని, మన పిడిఎఫ్ అభ్యర్థికి ప్రజాబలం, కార్యకర్తల బలం, సంఘాల బలం ఉందని తెలిపారు. సోషల్ మీడియాను ఉపయోగించుకుని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. డివి.రాఘవులు విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్సి ఇళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి పాలకులు ప్రజల జీవితాలు ఫణంగా పెట్టి కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన చట్టాలు చేస్తున్నారని విమర్శించారు. పాలకుల తప్పుడు విధానాలను ప్రశ్నించి ప్రజా సమస్యలను లేవనెత్తి పరిష్కారం కోసం కృషి చేసే రాఘవులును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్సి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. శాసనసభలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై అడిగేవారే లేరని, ఈ పరిస్థితుల్లో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సిఐటియు ఎటువంటి ఉద్యమం చేసినా రాజకీయాలతో సంబంధం లేకుండా పిడిఎఫ్ ఎంఎల్సిలు సహకరించేవారని గుర్తు చేశారు. ప్రజాసంఘాల రాష్ట్ర నేతలు మంతెన సీతారాం, బి.బలరాం మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలు అంటే అంటే ఓటర్లు పిడిఎఫ్ అభ్యర్థులకే ఓట్లు వేస్తారని, ప్రస్తుతం ఆ సీటు కోసం సంబంధం లేని వారు పోటీ చేస్తున్నారని, రాజ్యాంగం మనకు కల్పించిన హక్కుని రాజకీయ పార్టీలవారు లాక్కోవాలని చూస్తున్నారని అన్నారు. దీన్ని తిప్పికొట్టి పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్, సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు కె.ఉమామహేశ్వరరావు, పి.చంద్రశేఖర్, ఎస్.బాలాజీ, జ్యోతిబసు, శ్రీదేవి, అరుణకుమారి, రవికుమార్, ముస్తఫా ఆలీ, విజయరామరాజు, రామభద్రం, జయకర్, షరీఫ్, నరేష్, డిఎన్విడి.ప్రసాద్, ఎ.రవి, ఎస్ఎన్.రమేష్, జి.రవికిషోర్, బేబీరాణి, జెఎన్వి.గోపాలన్, అరుణ్కుమార్, ఐవి.సుధాకర్, కె.రాజారామ్మోహన్రారు, ఆర్.లింగరాజు పాల్గొన్నారు.

# విజయగౌరి నామినేషన్



గ్రేటర్ విశాఖ అమృత్ తెలంగాణ: ఫిబ్రవరి 7.విశాఖ కలెక్టరేట్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయగౌరి నామినేషన్ దాఖలు కార్యక్రమం విశాఖలో గురువారం అట్టహాసంగా సాగింది. ముందుగా ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి తరలివచ్చిన యుటిఎఫ్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆమె విశాఖ నగరంలోని సరస్వతి పార్క్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరారు. లీలామహల్ జంక్షన్, జగదాంబ జంక్షన్ మీదుగా ఈ ర్యాలీ సాగింది. జగదాంబ థియేటర్కు ఎదురుగా ఉన్న తెన్నేటి విశ్వనాథం విగ్రహానికి విజయగౌరి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అక్కడ నుంచి మరలా మహారాణిపేట, కెజిహెచ్ మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీ కొనసాగింది. అక్కడ ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పాలకులు విద్యారంగాన్ని నాశనం చేసే సంస్కరణలను అవలంబిస్తున్నారని తెలిపారు. విద్యారంగ పరిరక్షణకు విజయగౌరి గెలుపు అవసరమన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ రానున్న 20 రోజులూ ఎంతో కీలకమన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించుకునే లక్ష్యంతో అందరూ కలిసి పనిచేయాలన్నారు. విజయగౌరి నామినేషన్ ర్యాలీలో అధికంగా మహిళలు పాల్గొన్నారని, పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు కోసం ఇంటింటి కీ వెళ్తుంటే మహిళలంతా పిడిఎఫ్కే తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని చెబుతున్నారని, ఇదంతా చాలా ఉత్సాహం కలిగిస్తోందని అన్నారు. గతంలో అప్రంటీస్ రద్దుపై యుటిఎఫ్ పోరాడినప్పుడు నాటి ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు జాడ లేకుండా పోయాడన్నారు. జగన్ తెచ్చిన 117 జిఒకు వ్యతిరేకంగా విజయవాడలో వేల సంఖ్యలో టీచర్లంతా పోరాడినప్పుడు ఎంఎల్సిగా ఉన్న పాకలపాటి రఘువర్మ పత్తాలేకుండా పోయాడని తెలిపారు. అందుకే టీచర్లంతా పిడిఎఫ్ అభ్యర్థులపై నమ్మకంతో ఉన్నారని ఉద్ఘాటించారు. విద్యారంగ పరిరక్షణ కోసం ఉత్తరాంధ్రలో పోరాడిన చరిత్ర కోరెడ్ల విజయగౌరిదని, ఆమె కుటుంబానికి ఉద్యమ నేపథ్యం ఉందని గుర్తుచేశారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విజయగౌరి పోరాట ప్రస్థానాన్ని తెలిపారు. ఆమె విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ బొబ్బిలి బిడ్డ, సమస్యలపై ప్రశ్నించే గొంతు అయిన విజయగౌరికి విజయం చేకూరేలా అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఎరుకల సేవా సంఘం రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ గా జగన్నాథం గౌరీ

అమృత్ తెలంగాణ: కలికిరి (అన్నమయ్య) : ఎరుకల సేవా సంఘం రాష్ట్ర మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్గా కలిపి ఎస్టి కాలనీకి చెందిన జగన్నాథం గౌరీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ వర్మ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆదేశాల మేరకు ఆదివాసీ ఎరుకల హక్కుల కొరకు మరియు అణగారిన ఎరుకల హక్కుల సాధన కొరకు మేము సైతం ముందు వరుసలో ఉంటామని మాతో కలిసి ప్రయాణం చేయడం కోసం అన్నమయ్య జిల్లా కలికిరి వాస్తవ్యులు కుమారి జగన్నాథం గౌరీ (మహిళా పోలీస్ )ని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా నియమించడం జరిగిందని ఆయన తెలిపారు.

# బ్లాక్‌లో బర్త్‌డే స్పెషల్ కవ్వింపు



టాలీవుడ్లో టెంపర్, బాహుబలి, కిక్ 2 సినిమాల్లో ప్రత్యేక పాటల్లో కనిపించిన కెనడియన్ ముద్దుగుమ్మ నోరా ఫతేహి బాలీవుడ్లో వరుస సినిమాలతో దూసుకు పోతుంది టాలీవుడ్లో టెంపర్, బాహుబలి, కిక్ 2 సినిమాల్లో ప్రత్యేక పాటల్లో కనిపించిన కెనడియన్ ముద్దుగుమ్మ నోరా ఫతేహి బాలీవుడ్లో వరుస సినిమాలతో దూసుకు పోతుంది. 2015లో బిగ్‌బాస్ షో లో పాల్గొనడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. అదే సమయంలో ఒక డాన్స్ రియాల్టీ షోలోనూ పాల్గొనడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. విదేశీయురాలు అయినా ఇండియాలో మంచి గుర్తింపు దక్కించుకోవడంతో సినిమాల్లో ఆఫర్లు రావడం మొదలు అయ్యింది. డాన్సర్‌గా మంచి పేరు సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ నోరా ఫతేహికి ఎక్కువ శాతం డాన్స్ ప్రధానమైన పాత్రలు, ప్రత్యేక పాటల్లో అవకాశాలు వచ్చాయి.

బాలీవుడ్ చిత్రం సత్యమేవ జయతే సినిమాలో నటించడం ద్వారా హిందీ ప్రేక్షకులను మెప్పించింది. నటిగా ఫుల్ బిజీగా ఉండే నోరా ఫతేహి ఇటీవల ఒక పుకారుతో వార్తల్లో నిలిచింది. బంగీ జంప్ చేస్తూ ప్రమాదవశాత్తు లోయలో జారి పడిందంటూ పుకార్లు వచ్చాయి. ఆ ప్రమాదంలో నోరా ఫతేహీ చనిపోయిందని ఫేక్ వీడియోలు కొన్ని సోషల్ మీడియాలో హడావుడి చేశాయి. కొన్ని గంటల్లోనే నోరా ఫతేహీ టీం ఆ వార్తలను ఖండిస్తూ ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి ప్రమాదం జరగలేదని, పుకార్లను నమ్మవద్దంటూ క్లారిటీ ఇచ్చారు.

నేడు నోరా ఫతేహి పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉండే నోరా ఫతేహి ఈసారి బర్త్‌డే స్పెషల్‌గా అంతకు మించి అందమైన ఫోటోలను షేర్ చేసింది. బ్లాక్ డ్రెస్‌లో చూపు తిప్పుకోనివ్వకుండా అందమైన ఫోటోలను షేర్ చేసిన ఈ అమ్మడు బర్త్‌డే బిహేవియర్ అంటూ తనకు తాను పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఈ ఫోటోలను షేర్ చేసింది. తన ఫాలోవర్స్‌కి ఈ ఫోటోలతో బర్త్‌డే కానుక ఇచ్చింది.ఈ మధ్య కాలంలో ఈమె వ్యక్తిగత విషయాల కారణంగా వార్తల్లో నిలిచింది. సినిమాలు కాస్త తగ్గినా సోషల్ మీడియాలో మాత్రం ఈమె జోరు తగ్గడం లేదు. దాదాపుగా 50 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న నోరా ఫతేహి ఏం పోస్ట్ చేసినా లక్షల్లో రెస్పాన్స్‌లు వస్తూ ఉంటాయి.

# 'భీమా' భాయ్ ప్లాన్ ఏంటి..?



గత ఏడాది భీమా, విశ్వం సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన గోపీచంద్ ఈ ఏడాది ఇప్పటి వరకు కొత్త సినిమాలను అధికారికంగా ప్రకటించలేదు. గత దశాబ్ద కాలంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న మ్యాచో హీరో గోపీచంద్ సైలెన్స్ మెయింటెన్ చేస్తున్నారు. గత ఏడాది భీమా, విశ్వం సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన గోపీచంద్ ఈ ఏడాది ఇప్పటి వరకు కొత్త సినిమాలను అధికారికంగా ప్రకటించలేదు. ఆ మధ్య తన 'జిల్' చిత్ర దర్శకుడు రాధాకృష్ణతో సినిమా చేయబోతున్నట్లు వార్తలు వచ్చాయి. ప్రభాస్‌తో రాధేశ్యామ్ సినిమాను రూపొందించి తీవ్రంగా నిరాశ పరచిన దర్శకుడు రాధాకృష్ణ మరో బ్యూటీఫుల్ స్టైలిష్ సినిమాను గోపీచంద్‌తో మీడియం బడ్జెట్‌లో తీసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని, యూవీ క్రియేషన్స్‌లో ఆ సినిమా ఉంటుందనే ప్రచారం జోరుగా సాగింది. ఇప్పటి వరకు ఆ సినిమా విషయమై ఎలాంటి క్లారిటీ రాలేదు. గోపీచంద్ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేయాలని అనుకోవడం లేదు. ఏడాదికి ఒక్కటి చేసినా హిట్ కొట్టాలనే పట్టుదలతో ఉన్నాడు. అందుకే ఇప్పటి వరకు కొత్త సినిమాను పట్టాలెక్కించలేదు. రాధాకృష్ణ దర్శకత్వంలోనే కాకుండా మరో రెండు సినిమాలు సైతం చర్చల దశలో ఉన్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా సంపత్ నంది దర్శకత్వంలో ఒక సినిమాను గోపీచంద్ చేసేందుకు చర్చలు జరుగుతున్నాయి. గతంలో వీరి కాంబోలో సీటీమార్ సినిమా వచ్చి పర్వాలేదు అనిపించుకుంది. కనుక మరోసారి వీరి కాంబో మూవీని పట్టాలెక్కించే అవకాశాలు ఉన్నాయి.ప్రస్తుతం సంపత్ నంది చేస్తున్న సినిమా పూర్తి అయి విడుదల అయిన తర్వాత కొత్త సినిమా ప్రస్తావన ఉండే అవకాశం ఉంది. దానికి చాలా సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. అయితే అప్పుడప్పుడు మాత్రం సినిమాకు సంబంధించిన చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. గోపీచంద్, సంపత్ నంది కాంబోలో మూవీ ఎప్పటి వరకు కార్యరూపం దాల్చనుంది అనేది క్లారిటీ రావాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయాల్సిందే. గోపీచంద్ మరో దర్శకుడితోనూ చర్చలు జరిపారనే వార్తలు వస్తున్నాయి. విభిన్న చిత్రాల దర్శకుడిగా పేరు దక్కించుకున్న సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో గోపీచంద్ సినిమా ప్లాన్ చేస్తున్నారు. ఘాజి, అంతరిక్షం వంటి విభిన్న చిత్రాలను రూపొందించిన సంకల్ప్ రెడ్డి ఆ మధ్య గోపీచంద్‌కి ఒక పీరియాడిక్ డ్రామా కథను చెప్పాడని తెలుస్తోంది. ఈ మూడు సినిమాల కథల విషయంలోనూ గోపీచంద్ చాలా నమ్మకంగా ఉన్నారు. అందుకే మూడు సినిమాలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు. అయితే మొదట గోపీచంద్ మొదలు పెట్టబోతున్న సినిమా ఏది అనేది క్లారిటీ రావాల్సి ఉంది. రాధాకృష్ణ, సంకల్ప్ రెడ్డిలు ప్రస్తుతం సినిమాలు చేయకుండా స్క్రిప్ట్ వర్క్‌లో బిజీగా ఉన్నారు. కనుక వారిద్దరిలో ఒకరితో గోపీచంద్ తదుపరి సినిమా ఉండే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది రెండు సినిమాలతో వచ్చిన గోపీచంద్ ఈ ఏడాది ఒక్క సినిమా అయినా విడుదల చేసేనా అంటూ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.


# ఫ్యాన్స్ వల్ల అరుదైన వ్యాధికి గురైన సిద్ధార్థ్!



కొంతమందికి ఆ క్రేజ్ తక్కువ కాలంలోనే వస్తే, మరికొంత మందికి మాత్రం ఎంత ప్రయత్నించినా అందని ద్రాక్ష లాగే మిగిలి పోతుంటుంది. ఎప్పుడూ ఏదో కాంట్రవర్సీ కామెంట్స్ తో నిత్యం వార్తల్లో నిలుస్తూ ఉంటాడు హీరో సిద్ధార్థ్. ఇండస్ట్రీలోకి వచ్చిన ఎవరైనా సరే మంచి ఫేమ్, క్రేజ్, ఫాలోయింగ్, గుర్తింపు కోసం పరితపిస్తుంటారు. కొంతమందికి ఆ క్రేజ్ తక్కువ కాలంలోనే వస్తే, మరికొంత మందికి మాత్రం ఎంత ప్రయత్నించినా అందని ద్రాక్ష లాగే మిగిలి పోతుంటుంది కానీ ఆ ఫాలోయింగ్ వల్ల తనకు పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్ అనే వ్యాధి వచ్చిందని సిద్ధార్థ్ ఆశ్చర్యకర కామెంట్స్ చేశాడు. ఈ వ్యాధి వల్ల తానెంతో ఇబ్బంది పడ్డానని, ఆ సమస్య నుంచి కోలుకోవడానికి తనకు ఏడు నుంచి ఎనిమిది సంవత్సరాలు పట్టిందని సిద్ధార్థ్ వెల్లడించాడు. స్టార్ స్టేటస్ అందుకోవడానికి ఎంతో కష్టపడ్డానని చెప్పిన సిద్ధార్థ్ ఆ స్టేటస్ వచ్చాక ఆడియన్స్ వచ్చి తనతో మాట్లాడితే తెగ టెన్షన్ పడిపోయేవాడినని, నా స్టార్‌డమ్ ని నేనసలు ఎంజాయ్ చేయలేదని సిద్ధార్థ్ ఈ సందర్భంగా తెలిపాడు. అంత స్టార్‌డమ్ వచ్చినందుకు అందరికీ థాంక్‌ఫుల్ గా ఉండాలని అందరూ అనొచ్చు కానీ తన మానసిక పరిస్థితి అప్పుడు వేరేలా ఉందని సిద్ధార్థ్ ఈ సందర్భంగా వెల్లడించాడు. వాస్తవానికి స్టార్‌డమ్ వచ్చినప్పుడు ఎన్ని ఉన్నా అవన్నీ మర్చిపోయి కృతజ్ఞతగా ఉండాలని, తాను థాంక్ ఫుల్ గా ఉన్నప్పటికీ జనాల అటెన్షన్ తనకు అలవాటవడానికి చాలా టైమ్ పట్టిందని తనని తాను సమర్థించుకున్నాడు సిద్ధూ. అయితే తన భార్య అదితి రావు మాత్రం తనలా కాదని, చాలా డిఫరెంట్ గా ఉంటుందని ఆయన తెలిపాడు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# తెలుగమ్మాయి ఐకానిక్ ఫోజ్



అలాంటి సమయంలో తెలుగు అమ్మాయి ఈషా రెబ్బ హీరోయిన్‌గా మంచి అవకాశాలు దక్కించుకుంటుంది. ఇప్పటి వరకు పలువురు యంగ్ స్టార్ హీరోల సినిమాల్లో నటించిం తెలుగు అమ్మాయిలకు హీరోయిన్స్‌గా అవకాశాలు రావు, తెలుగు అమ్మాయిలు సినిమా ఇండస్ట్రీలో ప్రయత్నాలు చేయడం వృధా అనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తూ ఉంటారు. అలాంటి సమయంలో తెలుగు అమ్మాయి ఈషా రెబ్బ హీరోయిన్‌గా మంచి అవకాశాలు దక్కించుకుంటుంది. ఇప్పటి వరకు పలువురు యంగ్ స్టార్ హీరోల సినిమాల్లో నటించింది. అతి కొద్ది మంది తెలుగు అమ్మాయిలు మాత్రమే హీరోయిన్స్‌గా రాణిస్తున్న ఈ సమయంలో ముద్దుగుమ్మ ఈషా రెబ్బకి మంచి అవకాశాలు వచ్చాయి. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది. 2012లో లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. ఆ సినిమాలో పెద్దగా గుర్తింపు లేని పాత్ర అయినా ఆ తర్వాత తనకంటూ ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా కష్టపడింది. పేరు విభిన్నంగా ఉండి, తెలుగు అమ్మాయి కాకపోయి ఉండవచ్చు అని చాలా మంది అనుకున్నారు. ఇండస్ట్రీలో ఈషా రెబ్బా అంటే ఉత్తరాది అమ్మాయి అనే అభిప్రాయం ఉంది. అలా కొన్ని ఆఫర్లు ఈ అమ్మడు దక్కించుకుని ఉంటుంది అనేది కొందరి అభిప్రాయం. మొత్తానికి టాలీవుడ్‌లో మంచి ఆఫర్లను సొంతం చేసుకున్న ఈషా సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. బాలీవుడ్ ముద్దుగుమ్మలకు ఏమాత్రం తగ్గకుండా, టాలీవుడ్ స్టార్ హీరోయిన్స్‌తో సమానంగా అందంగా కనిపించే ఈషా రెబ్బ సోషల్ మీడియాలో షేర్ చేసే ఫోటోలు ఎప్పుడూ వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా మరోసారి ఈమె షేర్ చేసిన ఈ ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com